క్లుప్తంగా

సమ్మర్ క్యాంప్ ప్రారంభం



సమ్మర్ క్యాంప్‌లో పాల్గొన్న చిన్నారులు

తాళ్లరేవు: వేసవి నేపథ్యంలో తాళ్లరేవు చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక ప్రజా సంఘాల భవనంలో ఏర్పాటు చేసిన సమ్మర్ క్యాంప్ ఆదివారం ఉత్సాహంగా ప్రారంభమైంది. క్లబ్ కన్వీనర్ గుత్తుల మల్లేశ్వరరావు నేతృత్వంలో వారం రోజుల పాటు చిన్నారులకు చిత్రలేఖనం, వ్యాస రచన, నృత్యం, ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేయనున్నారు. కార్యక్రమంలో టిళ్లపూడి నాగేశ్వరరావు, పబ్బిసెట్టి మణి, మల్లాడి రాంబాబు, వీరన్న, నాని తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో అన్నదానం

తాళ్లరేవు: స్థానిక భూసమేత వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో స్వామివారి కల్యాణోత్సవాల ముగింపు సందర్భంగా ఆదివారం అన్నదానం నిర్వహించారు. అన్నదాన కార్యక్రమానికి తాళ్లరేవు పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు, స్థానిక నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా సోమాలమ్మ జాతర



ప్రత్యేక అలంకరణలో సోమాలమ్మ

ఉప్పలగుప్తం: మండలంలోని ఉప్పలగుప్తం గ్రామ పంచాయతీ పరిధి చీకట్లపాలెంలో వేంచేసి ఉన్న సోమాలమ్మ అమ్మవారి జాతర ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు చేసి, నైవేద్యాలు చెల్లించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి అన్నసమారాధన నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

విఘ్నేశ్వరునికి అష్ట ద్రవ్య అభిషేకాలు



విఘ్నేశ్వరుడికి అభిషేకాలు చేస్తున్న భక్తులు

అమలాపురం రూరల్: మండలంలోని పాత బండారులంక భువనేశ్వరి సమేత త్రయంబకేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం పవిత్ర వైశాఖ సంకటహర చతుర్థి సందర్భంగా విఘ్నేశ్వరునికి అష్ట ద్రవ్య అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పురోహితుడు సద్గురువు సత్యనారాయణ స్వామివారికి గరికి పూస పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి స్వామిని దర్శించుకున్నారు.

ఇసుక లారీ పట్టివేత



సుంకరపాలెం జాతీయ రహదారి వద్ద అధికారులు పట్టుకున్న ఇసుక లారీ

తాళ్లరేవు: మండలంలోని సుంకరపాలెం జాతీయ రహదారిలో అనుమతుల్లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న లారీని ఎస్ఈబీ అధికారులు ఆదివారం పట్టుకుని డ్రైవర్‌ను అరెస్ట్ చేశారు. ఇసుకాసురులపై కఠిన చర్యలు చేపడతామని జిల్లా కలెక్టర్ జె.నివాస్ ఇటీవల హెచ్చరికలు చేసినా అక్రమార్కులు వాటిని బేఖాతర్ చేస్తున్నారు. కేంద్రపాలిత ప్రాంతమైన యానాం, ఆంధ్రా ప్రాంత సరిహద్దుల్లో రాత్రి వేళల్లో జోరుగా ఇసుక తవ్వకాలు సాగించి సొమ్ములు చేసుకుంటున్నారు. కొందరు కీలక అధికారుల అండతోనే ఇసుక అక్రమ తరలింపు సాగుతుందన్న చర్చ సర్వత్రా సాగుతుంది.

కోర్సుల ఫీజులపై సూచనలివ్వండి

యానాం: పుదుచ్చేరి వ్యాప్తంగా ఉన్న బీటెక్, బీఈడీ, లా కోర్సులకు సంబంధించి ప్రైవేట్, సెల్ఫ్ ఫైనాన్సింగ్ కాలేజీలకు సంబంధించి ఫీజుల నిర్ధారణకు సంబంధించి సూచనలు, సలహాలు అందజేయాలని డైరెక్టరేట్ ఆఫ్ హయ్యర్ అండ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అధికారులు ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. రిటైర్డ్ మద్రాసు హైకోర్టు జడ్జి జస్టిస్ ఎస్.కన్నమాల్ చైర్మన్‌గా ఇప్పటికే ఫీజు కమిటీ ఏర్పడిన నేపథ్యంలో త్వరలో ఫీజుల నిర్ధారణ జరుగుతుందన్నారు. ఈలోగా తల్లిదండ్రులు, పేరెంట్స్ అసోసియేషన్‌లు తమ సూచనలు, సలహాలను ఈ నెల 28లోగా 'డీహెచ్‌టీఈ ఎట్‌దిరైట్‌ఆఫ్ డీహెచ్‌పీడీవై.ఈడీయూ.ఇన్' ఈమెయిల్‌కు పంపాలని కోరారు.

చినుకు పడితే గోదారే

- నిలిచిపోయిన గుడ్డివానిచింత – ఎస్.పల్లిపాలెం రోడ్డు నిర్మాణ పనులు
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న ఆరు గ్రామాల ప్రజలు



వర్షపు నీటితో నిండిపోయిన దేవగుప్తం ప్రధాన రహదారి



బురదమయంగా మారిన సామంతకుర్రు రహదారి

అల్లవరం: గుడ్డివానిచింత నుంచి ఎస్.పల్లిపాలెం వరకూ పది కిలోమీటర్ల పొడవునా సీఆర్ఎఫ్ నిధులు రూ.19 కోట్లతో చేపట్టిన రోడ్డు విస్తరణ పనులు రెండు నెలలుగా నిలిచిపోయాయి. గతేడాది అక్టోబర్ నెలలో ప్రారంభమైన రోడ్డు విస్తరణ పనులు ఈ ఏడాది మార్చి 31 లోగా పూర్తి చేయాల్సి ఉంది. అయితే నేటికీ కనీసం 50 శాతం పనులు కూడా పూర్తి కాలేదు. ఎంట్రుకోన–దేవగుప్తం గ్రామాల మధ్య కాలువపై వంతెన పూర్తి చేసి రాకపోకలకు అవకాశం కల్పించారు. అయితే రోడ్డు విస్తరణ పనులు మాత్రం నత్తనడకన నిర్వహిస్తున్నారు. ఈలోగా సార్వత్రిక ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో కాంట్రాక్టర్ ఎక్కడి పనులు అక్కడే వదిలేశారు.

ఇదీ ప్రస్తుత పరిస్థితి

- గుడ్డివానిచింత నుంచి దేవగుప్తం వరకూ రోడ్డుకి ఇరువైపులా బెర్మ్‌ని విస్తరించి వెట్ మిక్సర్ వేసి రోలింగ్ చేసి వదిలేశారు.
- డి.రావులపాలెం వంతెన నుంచి సామంతకుర్రు ఆంజనేయ స్వామి వారి ఆలయం వరకూ నిర్మాణ పనులు ఇప్పటివరకూ ప్రారంభమే కాలేదు. ఎంట్రుకోన, దేవగుప్తం, సామంతకుర్రు గ్రామాల్లో సీసీ రోడ్డు నిర్మాణం చేయాల్సి ఉన్నా కనీసం ప్రారంభించలేదు. దీంతో రోడ్డంతా గోతులతో అటుగా వెళ్లేవారికి అడుగడుగునా నరకప్రాయంగా మారింది.
- గుడ్డివానిచింత నుంచి దేవగుప్తం వరకూ రోడ్డంతా గతుకులమయంగా మారింది. దీనికి తోడు ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రోడ్డంతా బురదమయంగా మారింది. వర్షపు నీరు దిగే దారి లేక ఎక్కడ గొయ్యి ఉందో తెలియక వాహనదారులు ఆ రోడ్డులో ప్రయాణించాలంటేనే వణికిపోతున్నారు.
- ఆర్అండ్‌బీ అధికారుల పర్యవేక్షణ లోపం, కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆరు గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణ పనులను వేగవంతం చేయాలని కోరుతున్నారు. అయితే అధికారులేమో సీఆర్ఎఫ్ నిధులు ఆగడం వల్లే పనులు నిలిచిపోయాయని చెబుతున్నారు.

> **కేంద్రం నుంచి నిధులు రావాల్సి ఉంది**
>
> గుడ్డివానిచింత నుంచి ఎస్.పల్లిపాలెం వరకూ రోడ్డు నిర్మాణ పనులు 50 శాతం పూర్తయ్యాయి. ఎంట్రుకోన, దేవగుప్తం, సామంతకుర్రు గ్రామాల్లో సీసీ రోడ్డుకు సంబంధించిన మెటీరియల్‌ను సిద్ధం చేసి స్టాక్ ఉంచారు. అయితే కేంద్రం నుంచి రావాల్సిన సీఆర్ఎఫ్ నిధులు విడుదల కాకపోవడంతో కాంట్రాక్టర్ పనులను తాత్కాలికంగా నిలిపేశారు. నిధులు విడుదల కాగానే పనులు ప్రారంభమవుతాయి.
>
> – రాఘవరావు, డీఈ, ఆర్అండ్‌బీ, అమలాపురం

కవి నల్లాకు సత్కారం



కవి నల్లాను సత్కరిస్తున్న డీఐఈవో సోమశేఖరరావు తదితరులు

అమలాపురం టౌన్: అన్నమయ్య సాహితీ పురస్కారానికి ఎంపికైన పట్టణానికి చెందిన కవి, శ్రీశ్రీ కళా వేదిక జిల్లా అధ్యక్షుడు నల్లా నరసింహమూర్తిను స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలోని జిల్లా ఇంటర్మీడియెట్ ఎడ్యుకేషన్ అధికారి కార్యాలయంలో ఆదివారం సాయంత్రం సత్కరించారు. డీఐఈవో వనుము సోమశేఖరరావు కవి నల్లాను దుశ్శాలువాతో అభినందించారు. కవి నల్లా గత మూడు దశాబ్దాలకు పైగా అందిస్తున్న సాహితీ సేవలకు గుర్తింపుగా ఈ పురస్కారం లభించిందని సోమశేఖరరావు అన్నారు. సత్కార కార్యక్రమంలో ముమ్మిడివరం, రావులపాలెం ప్రభుత్వ కళాశాలల ప్రిన్సిపాల్స్ ఎస్.రంగారావు, పి.గోపాలకృష్ణ, డీఐఈవో కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ ఎన్‌బీ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా కల్యాణం



బండారులంకలో వేంకటేశ్వరస్వామి కల్యాణం జరిపిస్తున్న కల్యాణ కర్తలు



వేంకటేశ్వరుని దివ్య కల్యాణం తిలకిస్తున్న భక్తులు

అమలాపురం రూరల్: మండలంలోని బండారులంకలో పద్మావతి అలివేలు మంగ సమేత వేంకటేశ్వర స్వామివారి దివ్య కల్యాణం భక్తుల గోవింద నామస్మరణలు, వేద పండితుల మంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాలు నడుమ శనివారం రాత్రి కన్నుల పండువగా జరిగింది. శ్రీనివాస బాల మిత్ర సంఘం ఆధ్వర్యంలో 37వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని లోక కల్యాణార్థం సుగంధ భరిత పుష్పమాలికలతో ప్రత్యేకంగా అలంకరించిన వేదికపై స్వామి, అమ్మవార్లను కొలువు దీర్చారు. కల్యాణ క్రతువులో స్వామివారి తరపున అర్చకులు, దేవేరుల తరపున భక్తులు కల్యాణకర్తలుగా వ్యవహరించారు. మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ దంగేటి డోలామణి, రుద్ర దంపతులు పట్టు వస్త్రాలు, ఉప సర్పంచ్ కామిశెట్టి శ్రీనివాసరావు ముత్యాల తలంబ్రాలు, చింతపట్ల సత్యనారాయణ దంపతులు మంగళ సూత్రాలు, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి సరెళ్ల రామకృష్ణ దంపతులు కర్పూర దండలు, మాజీ ఎంపీపీ ఊటుకూరి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, పిచ్చిక శాంతి, ప్రభాకర్, చింతపట్ల గంగా సత్యనారాయణ, ఉప్పుగంటి భాస్కరరావు ఉత్తర జంధ్యాలు, నూతన వస్త్రాలు, తలంబ్రాల బియ్యం సమర్పించారు. కారుపర్తి మల్లేశ్వరరావు శిష్య బృందం అర్చకత్వంలో కల్యాణం వైభవంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులకు పులిహోర ప్రసాదం, లడ్డు ప్రసాదంతో పాటు పానకం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ అంకం హిమ భారతి, సొసైటీ మాజీ చైర్మన్ దంగేటి బుల్లబ్బులు, బాలమిత్ర సంఘ ప్రతినిధులు జాన గణేష్, కట్టా చండీ ప్రియ, చింతపట్ల బాబు, అంకం నాగ సత్యనారాయణ, లక్కింశెట్టి ఫణి రాజు, బిళ్ల విశ్వేశ్వరరావు, అంకం పెద రాజు తదితరులు పాల్గొన్నారు.

మునికుమారికి ఎమ్మెల్సీ పరామర్శ



మునికుమారిని పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు

ముమ్మిడివరం: పితృ వియోగంతో బాధపడుతున్న వైఎస్సార్ సీపీ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు కాశి బాలమునికుమారిని ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు ఆదివారం పరామర్శించారు. మునికుమారి తండ్రి కటికదల సుబ్బారావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలిసిందే. ముమ్మిడివరంలోని సుబ్బారావు స్వగృహంలో మునికుమారిని ఎమ్మెల్యే కుడిపూడి సూర్యనారాయణరావుతో పాటు నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్, పెన్మత్స చిట్టిరాజు, కోలా బాబ్జి, నల్లా నరసింహమూర్తి, కుడిపూడి త్రినాథ్, కాశి పరివాజ్‌కుమార్, బాలయ్య, బాలయోగి, సక్కా సర్వేశ్వరరావులు పరామర్శించి ప్రగాఢ సానుభూతిని వ్య క్తం చేశారు.

లోక కల్యాణార్థం యాగాల నిర్వహణ



రామలింగేశ్వరస్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న పండితులు

ఐ.పోలవరం: మండలంలోని కేశనకుర్రుపాలెంలో వేంచేసిన రామలింగేశ్వర స్వామి ఆలయంలో లోక కల్యాణార్థం వచ్చే నెల 23వ తేదీ నుంచి 12 రోజుల పాటు రుద్ర యాగం, సౌర యాగం, చండీ యాగం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆదివారం వినాయకుని పూజ నిర్వహించి యాగ పనులకు శ్రీకారం చుట్టారు. నిత్యం స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, విశేష పూజలు, అన్నదానం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు చెప్పారు. ఆదివారం జరిగిన పూజా కార్యక్రమాల్లో వేగి రాజు గణపతి రాజు, పిన్నంరాజు వర్మ, గాదిరాజు శ్రీనివాసరాజు, యావన్మంద లచ్చిరాజు, తోటకూర కృష్ణంరాజు, బొంతు కనకారావు తదితరులు ఉన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు



చిందాడగరువులో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అమలాపురం సీఐ క్రిస్టోఫర్

అమలాపురం రూరల్: ఎన్నికల కౌంటింగ్ సమయంలో ఎవరైనా అత్యుత్సాహం ప్రదర్శించి శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అమలాపురం పట్టణ సీఐ క్రిస్టోఫర్ హెచ్చరించారు. చిందాడగరువు గ్రామంలో ఆదివారం రాత్రి ఆయన ప్రజలు, రాజకీయ పార్టీల నాయకులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ క్రిస్టోఫర్ మాట్లాడుతూ ఓట్ల లెక్కింపుకు సంబంధించి రెచ్చగొట్టే ప్రకటనలు చేసినా, సోషల్ మీడియాలో తప్పులు ప్రచారం చేసినా చట్టపరంగా చర్యలు తప్పవన్నారు. ఎన్నికల కౌంటింగ్ శాంతియుత వాతావరణంలో ముగిసేలా అందరూ సహకరించాలని కోరారు. సమావేశంలో పట్టణ ఎస్ఐ కిషోర్, సర్పంచ్ పి.గణేష్ తదితరులు పాల్గొన్నారు

ట్రిపుల్ ఐటీ విద్యార్థులకు నిర్మాణ పనులపై అవగాహన



నూజివీడు ట్రిపుల్ ఐటీ విద్యార్థులకు సూచనలిస్తున్న డీఈఈ రాంబాబు

అల్లవరం: నూజివీడు ట్రిపుల్ ఐటీలో సివిల్ విభాగంలో ఇంజినీరింగ్ చేస్తున్న విద్యార్థులకు ప్రధాన మంత్రి గ్రామీణ సడక్ యోజన పథకంలో రూ.1.20 కోటి నిధులతో బోడసకుర్రు నుంచి బెండమూర్లంక వరకూ నిర్మిస్తున్న రోడ్డు నిర్మాణ పనులపై డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ అన్యం రాంబాబు ఆదివారం అవగాహన కల్పించారు. బోడసకుర్రు వద్ద కాలువపై నిర్మిస్తున్న బ్రిడ్జి నిర్మాణ పనులపై విద్యార్థులకు వివరించి పలు సలహాలు, సూచనలు చేశారు. విద్యార్థులు తరగతి గదుల్లో పాఠాలు చదువుకోవడంతో పాటు క్షేత్రస్థాయి పరిశీలన ద్వారా మరింత జ్ఞానాన్ని పొందొచ్చని డీఈ రాంబాబు అన్నారు.

ఉపద్రవాల నివారణకు హనుమాన్ చాలీసా పారాయణ



సమావేశంలో పాల్గొన్న ఆధ్యాత్మిక వేత్త కుమార్ శంకర్ గౌడ్, ధార్మిక కార్యకర్తలు

అమలాపురం టౌన్: ఉపద్రవాల నివారణకు సామూహికంగా చేసే హనుమాన్ చాలీసా పారాయణ మార్గాన్ని చూపుతుందని అధ్యాత్మికవేత్త రేలంగి కుమార్ శంకర్‌గౌడ్ అన్నారు. స్థానిక రావులచెరువు ప్రాంతంలోని కోదండ రామాలయం, వనచర్ల వీధిలోని రామాలయంలో ఆదివారం జరిగిన ధార్మిక కార్యకర్తల సమావేశాల్లో కుమార్ శంకర్ గౌడ్ మాట్లాడారు. వచ్చే నెల 2వ తేదీన అమలాపురం కాపు కల్యాణ మంపడంలో విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో జరగనున్న సహస్ర హనుమాన్ చాలీసా పారాయణ మహా యజ్ఞం విశిష్టతను ధార్మిక కార్యకర్తలు, భక్తులకు ఆయన వివరించారు. ఈ మహా యజ్ఞంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. సమావేశాల్లో ధార్మిక కార్యకర్తలు గొవ్వాల అచ్యుత రామయ్య, చప్పిడి వెంకటేశ్వరరావు, కుడుపూడి ఈశ్వరరావు, బొంతు వెంకట రమణ, మహిళలు, రావులచెరువు, వనచర్ల వీధి పెద్దలు పాల్గొన్నారు.

కష్టపడి కాదు ఇష్టపడి చదవాలి

యండమూరి వీరేంద్రనాథ్



ప్లేస్‌మెంట్ డేలో పాల్గొన్న ప్రముఖ రచయిత యండమూరి వీరేంద్రనాథ్

తాళ్లరేవు: విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదివితే ఉన్నత లక్ష్యాలను అధిరోహించొచ్చని ప్రముఖ సినీ రచయిత, వ్యక్తిత్వ వికాస నిపుణుడు యండమూరి వీరేంద్రనాథ్ తెలిపారు. శనివారం రాత్రి పటవల పైడా గ్రూపు విద్యాసంస్థల ఆధ్వర్యంలో నిర్వహించిన ప్లేస్‌మెంట్ డే సెలబ్రేషన్స్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా యండమూరి మాట్లాడుతూ విద్యార్థులు నిర్దేశిత లక్ష్యాన్ని ఎంచుకుని లక్ష్యసాధనకు కృషి చేయాలన్నారు. ఇష్టంతో చేసే ఏ పనైనా మంచి ఫలితాలు ఇస్తుందన్నారు. జీవితంలో ఎంత ఉన్నతిని సాధించినా కన్న తల్లిదండ్రులను మాత్రం మరవరాదన్నారు. ఈ సందర్భంగా క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ఉద్యోగాలు సాధించిన 362 మంది విద్యార్థులను యండమూరి అభినందించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ పైడా సత్య శ్రీరామ్, జేఎన్‌టీయూ కంప్యూటర్ సైన్స్ విభాగం అధ్యాపకుడు కృష్ణమోహన్, డీన్ వీరభద్రరావు, డిప్యూటీ డైరెక్టర్ కె.రవీంద్రరెడ్డి, ప్రిన్సిపాల్స్ పీవీ సూర్యప్రకాష్, కేశవ్, సురేష్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ రవికుమార్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ సుమ తదితరులు పాల్గొన్నారు.

రోజువారీ పరిపాలనలో జోక్యం తగదు

యానాం: పుదుచ్చేరిలో ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికైన ప్రభుత్వం ఉన్నప్పుడు ఎల్జీ సీపీ రాధాకృష్ణన్ రోజువారీ పరిపాలనలో జోక్యం చేసుకోవడం తగదని మాజీ సీఎం నారాయణసామి అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎల్జీ సీపీ రాధాకృష్ణన్ రాజ్‌నివాస్‌లో ఉన్నత స్థాయి సమావేశాలు నిర్వహించాలని తీసుకున్న నిర్ణయం పూర్వపు ఎల్జీలైన కిరణ్‌బేడీ, తమిళిసై సౌందరాజన్ పాలనా శైలిని అనుసరిస్తున్నట్లు ఉందని ఎద్దేవా చేశారు. ప్రభుత్వ పరిపాలనలో ఎల్జీ జోక్యం చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. చెత్త నిర్వహణ, గంజాయి ముప్పు వంటి సమస్యలపై మాత్రం ఎల్జీ జోక్యాన్ని తాము స్వాగతిస్తున్నామన్నారు.

తైక్వాండోకు పెరుగుతున్న ఆదరణ



అంబాజీపేటలో తైక్వాండోలో శిక్షణ పొందుతున్న క్రీడాకారులు

అంబాజీపేట: ఆత్మరక్షణతో పాటు ఉత్తమ క్రీడాకారుడిగా గుర్తింపు పొందేందుకు ఇటీవల తైక్వాండోపై విద్యార్థులు ఆసక్తి కనబరుస్తున్నారు. అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహిస్తున్న తైక్వాండో వేసవి శిక్షణా శిబిరంలో సుమారుగా 200 మంది క్రీడాకారులు పాల్గొని శిక్షణ పొందుతున్నారు. ఎక్కువగా బాలికలు అధికంగా పాల్గొని శిక్షణ పొందుతున్నారు. క్రీడలు మానసికోల్లాసానికి, శరీర దృఢత్వానికే కాకుండా ఆరోగ్యానికి వ్యాయామం ఎంతో ఉపయోగమనే లక్ష్యంతో విద్యార్థుల తల్లితండ్రులు ఆసక్తి కనబరుస్తున్నారు. స్థానిక హైస్కూల్‌లో తైక్వాండో సీనియర్ కోచ్ పితాని త్రిమూర్తులు పర్యవేక్షణలో సుమారు 20 ఏళ్లుగా తైక్వాండో శిక్షణ ఇస్తున్నారు. ఇక్కడ తర్ఫీదు పొందిన 30 మంది క్రీడాకారులు జాతీయ స్థాయిలోను, 150 మంది రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికై గోల్డ్ మెడల్ సాధించిన వారిలో ఉన్నారు. బ్లాక్ బెల్ట్ పొందిన క్రీడాకారులు 30 మంది, నేషనల్ రిఫరీలుగా విధులు నిర్వహిస్తున్న వారు 9 మంది ఉన్నారు. వేసవి సెలవులు కావడంతో చిన్నారులను సైతం తైక్వాండో వైపే వారి తల్లిదండ్రులు మొగ్గు చూపుతున్నారు. వేసవి శిక్షన పూర్తయిన అనంతరం కూడా శిక్షణ తరగతులను ఉదయం 6 గంటల నుంచి నిర్వహిస్తామని త్రిమూర్తులు తెలిపారు.

రాజీవ్ బీచ్‌లో అడ్డంగా సిమెంట్ బెంచీలు

యానాం: గౌతమీ గోదావరి నదీ తీరంలో కొంత సేపు ఆహ్లాదంగా గడిపేందుకు స్థానిక రాజీవ్ రివర్ బీచ్‌కు సందర్శకులు అధికసంఖ్యలో వస్తుంటారు. ఈ నేపథ్యంలో గోదావరి అందాలను వీక్షించేందుకు, బోటు షికారుకు యానాం పరిసర ప్రాంతాల నుంచి వస్తుంటారు. అయితే సందర్శకులు కూర్చునేందుకు పర్యాటకశాఖ గోదావరికి అభిముఖంగా వేసిన సిమెంట్ బెంచీలను కొందరు ఆకతాయిలు అడ్డదిడ్డంగా జరిపేస్తున్నారు. దీంతో ఫుట్‌పాత్‌పై నడిచి వెళ్లేవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు మహిళలు సైతం ఆకతాయిల కారణంగా అటుగా వెళ్లాలంటే భయపడుతున్నారు.

పేకాట క్లబ్ నిర్వహణపై ఆందోళన

యానాం: పట్టణ పరిధిలో రిక్రియేషన్ క్లబ్ పేరిట పేకాట క్లబ్ నిర్వహిస్తున్నా అధికార యంత్రాంగం పట్టించుకోవడం లేదని పరిసర గ్రామాల ప్రజలు ఆదివారం ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో దొమ్మేటిపేటలో నిర్వహించిన పేకాట క్లబ్‌పై అప్పట్లో ఆందోళనల నేపథ్యంలో అధికారులు మూయించేశారు. కాని మళ్లీ స్థానిక న్యూబస్టాండ్ సమీపంలో ఓ మూతబడిన ఇండస్ట్రీ ఆవరణలో పేకాట క్లబ్ ప్రారంభించడంపై వెంకట్‌నగర్, అంబేడ్కర్ నగర్, మెట్టకూరు పరిసర ప్రాంతాలకు చెందిన నివాసితులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పేకాట క్లబ్‌ల వల్ల యువత పెడదోవ పట్టే అవకాశముందని, శాంతిభద్రతలకు విఘాతం కలిగితే ఎవరు బాధ్యత వహిస్తారని వారు ప్రశ్నిస్తున్నారు. పేకాట క్లబ్‌పై చర్యలు తీసుకోవాలని సోషల్ యాక్టివిస్ట్ సబ్బతి శ్రీనివాస్ తదితరులు అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఎల్జీ, పుదుచ్చేరి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి సైతం వినతి పత్రం అందించనున్నట్లు తెలిపారు.

29న విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక

యానాం: స్థానిక విద్యుత్ శాఖ కార్యాలయంలో ఈ నెల 29న ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకూ కేంద్రపాలిత ప్రాంతాలు, గోవా రాష్ట్ర ఉమ్మడి విద్యుత్ నియంత్రణ కమిషన్ ఏర్పాటుచేసిన వినియోగదారుల సమస్యల పరిష్కార వేదికను నిర్వహించనున్నట్లు అసిస్టెంట్ ఇంజినీర్ లంక కృష్ణారావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ పంపిణీలో సమస్యలు, పేరు బదిలీ, బిల్లుల జారీ, సవరణ, పనిచేయని మీటర్ల మార్పు, విద్యుత్ అంతరాయం, లోఓల్టేజీ, హైఓల్టేజీ తదితర సమస్యలపై వినియోగదారులు తమ రాతపూర్వక ఫిర్యాదులు చేయొచ్చన్నారు.

విద్యుదాఘాతంతో రెండు ఆవులు మృతి

ఉప్పలగుప్తం: మండలంలోని ఎస్.యానాం గ్రామంలో ఆదివారం రాత్రి ప్రమాదవశాత్తూ విద్యుత్ షాక్‌కు గురై రెండు ఆవులు అక్కడికక్కడే మృతి చెందాయి. పంచాయతీ పరిధిలోని ఓఎన్జీసీ అనుసంధాన సంస్థలైన వేదాంత, కెయిన్ అన్ లోడ్ పాయింట్‌కు కొన్ని రోజుల క్రితం అన్‌లోడింగ్‌కు వచ్చిన ఆయిల్ లారీ ట్యాంకర్ రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. దీంతో విద్యుత్ స్తంభం విరిగిపడి విద్యుత్ వైర్లు చేతికి అందే ఎత్తులో ఉన్నాయి. ఈ విషయంపై విద్యుత్ అధికారులు మరమ్మతుల సంబంధించిన అంచనాలు పరిశ్రమ అధికారులకు అందజేశామని చెప్పి చేతులు దులుపేసుకున్నారు. పరిశ్రమ అధికారులు ఆ మరమ్మతులపై శ్రద్ధ చూపించకపోవటంతో ఆదివారం అటుగా మేతకు వెళ్తున్న రెండు ఆవులకు విద్యుత్ తీగలు తగిలి షాక్‌కు గురై మృతి చెందాయి. దీంతో నష్టపరిహారం కోరుతూ ఆవుల యజమానులు, గ్రామస్తులు పరిశ్రమ వర్గాలను నిలదీశాయి. ఆవులకు నష్టపరిహారం ఇవ్వాలంటూ గ్రామ పెద్దలు జోగి రాజా, ఎంపీటీసీల సమాఖ్య మండల అధ్యక్షుడు పెట్టా అప్పారావు, లంకే శ్రీను, పొగాకు శ్రీను, లంకే చిరంజీవి ఆవుల యజమాని బడుగు రామచంద్ర రావు డిమాండ్ చేశారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

రాజోలు: కడలి ఉన్నత పాఠశాలలో 2003–04లో పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. బాల్యంలో విద్యను అభ్యసించిన సమయంలో స్నేహితులంతా ఒకచోట కలుసుకుని తమ తీపి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఆనాడు పాఠాలు బోధించిన ఉపాధ్యాయులను సమ్మేళనానికి ఆహ్వానించి ఘనంగా సత్కరించారు. హైదరాబాద్, విశాఖపట్టణం, రాజమహేంద్రవరం, కాకినాడ తదితర సుదూర ప్రాంతాల్లో వివిధ ఉద్యోగ, వ్యాపారాల్లో స్థిరపడిన స్నేహితులంతా సమ్మేళనానికి విచ్చేశారు.